సాక్షి
నల్లగొండ
ఆదివారం । 16 । ఫిబ్రవరి । 2025



భద్రత.. కట్టుదిట్టం

చివ్వెంల మండలం దురాజ్‌పల్లి పెద్దగట్టు జాతరకు పోలీస్ శాఖ భద్రత కట్టుదిట్టం చేసింది. - 8లో



బీజేపీ అభ్యర్థిని గెలిపించండి

బీజేపీ అభ్యర్థి నరోత్తమ్‌రెడ్డిని ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కోరారు. - 8లో



హామీలు అమలు చేయాలి

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. - 8లో

గొల్లగట్టుకు వెళ్లొద్దాం

నేటి నుంచి దురాజ్‌పల్లి శ్రీలింగమంతులస్వామి జాతర

- గంపల ప్రదక్షిణతో ప్రారంభం
- రాత్రి కేసారం నుంచి పెద్దగట్టుకు రానున్న దేవరపెట్టె
- సర్వం సిద్ధం చేసిన యంత్రాంగం



ప్రత్యేక అలంకరణలో చౌడమ్మ, గంగమ్మ, ఎలమంచమ్మ అమ్మవార్ల విగ్రహాలు



విద్యుత్ వెలుగుల్లో దురాజ్‌పల్లి శ్రీలింగమంతులస్వామి ఆలయం

చివ్వెంల(సూర్యాపేట): రాష్ట్రంలోనే రెండవ అతిపెద్దదైన సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం దురాజ్‌పల్లిలోని శ్రీలింగమంతుల స్వామి (పెద్ద గట్టు) జాతరకు యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఐదు రోజుల పాటు జరగనున్న ఈ జాతర ఆదివారం రాత్రి గంపల ప్రదక్షిణతో ప్రారంభం కానుంది. రాత్రి సూర్యాపేట మండలం కేసారం గ్రామం నుంచి చౌడమ్మ తల్లి దేవరపెట్టెను పెద్దగట్టుకు ఊరేగింపుగా తీసుకొస్తారు. దేవరపెట్టెలో గొల్లలు ఆరాధించే శ్రీ లింగమంతుల స్వామితో పాటు 33మంది దేవతల గణం ఉంటుంది. సుమారు 400 ఏళ్లుగా రెండేళ్లకు ఒకసారి జరుగుతున్న ఈ జాతరకు మనరాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించుకుంటున్నారు.

ఆలయ సంప్రోక్షణ పూర్తి

ఆలయ కమిటీ, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే ఆలయానికి రంగులు వేయించి, సంప్రోక్షణ చర్యలు చేపట్టారు. మెట్లు, ప్రవేశద్వారానికి రంగుల వేశారు. తలనీలాలు, టెంకాయల వేలంపాటలు పూర్తి చేశారు. భక్తుల రవాణాకు ఆర్టీసీ బస్సుల సౌకర్యం కల్పించింది. తాగునీటి వసతితోపాటు, చలువ పందిర్లు ఏర్పాటు చేశారు. జాతరలో వివిధ రకాల దుకాణాలతోపాటు వినోద శాలలు వెలిశాయి.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

జాతరలో పారిశుద్ధ్యపై ప్రత్యేక శ్రద్ధ వహించారు. జాతరను 8 జోన్లుగా విభజించారు. 7 ప్రాంతాల్లో శాశ్వత మరుగుదొడ్లు, 24 చోట్ల మహిళలకు, 48 చోట్ల పురుషులకు వేర్వేరుగా టాయిలెట్లు ఏర్పాటు చేశారు. ఐదు రోజుల పాటు మూడు షిఫ్ట్‌ల ప్రకారం ఒక్కో షిఫ్ట్‌కు 130 మంది చొప్పున 390 మంది కార్మికులు పారిశుద్ధ్య విధుల్లో పాల్గొనున్నారు. షిఫ్ట్‌కు నాలుగు ట్రాక్టర్ల ద్వారా చెత్తాచెదారం తొలగించనున్నారు. ఇందుకు 19మంది సూపర్‌వైజర్లు, 12 మంది జవాన్లను నియమించారు. రాత్రి పూట వెలుగులు విరజిమ్మేలా ఎల్ ఈడీ లైటింగ్స్ ఏర్పాటు చేశారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా కోసం నాలుగు జనరేటర్లు అందుబాటులో ఉంచారు. కోనేరులో శివుని విగ్రహం ప్రతిష్ఠించారు.

ఏర్పాట్ల పరిశీలన

జాతరలో భక్తుల కోసం కల్పించిన సౌకర్యాలు, ఇతర ఏర్పాట్లను శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కోటాచలం, సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవ్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, తహసీల్దార్ కృష్ణయ్య పర్యవేక్షించారు. ఈ జాతరకు 30 లక్షల మంది వరకు భక్తులు తరలిరానున్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు.



లింగమంతుల స్వామి దేవాలయం పక్కన ఉన్న నాగులమ్మ గుడి



కోనేరులో ఏర్పాటు చేసిన శివుడి విగ్రహం

పెద్దగట్టు ఆలయంలో ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ పూజలు

చివ్వెంల(సూర్యాపేట): మండలంలోని దురాజ్‌పల్లిలో గల శ్రీలింగమంతుల స్వామి (పెద్దగట్టు) దేవస్థానాన్ని శనివారం రాష్ట్ర భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందదర్భంగా స్వామివారి సన్నిధిలో ప్రత్యేక ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు.



స్వామివారిని దర్శించుకున్న ఐఏఎస్ అధికారి వినయ్ కృష్ణారెడ్డి, కుటుంబ సభ్యులు

పెద్దగట్టుకు మకర తోరణం



మకర తోరణం ఊరేగింపులో మాజీ ఎంపీ బడుగుల, వేణారెడ్డి తదితరులు

సూర్యాపేట టౌన్: దురాజ్‌పల్లిలో ఆదివారం నుంచి ఐదు రోజులపాటు జరగనున్న శ్రీలింగమంతుల స్వామి జాతర మహోత్సవానికి శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని గొల్ల బజార్ నుంచి స్వామివారి మకర తోరణం భారీ ఊరేగింపు నడుమ పెద్దగట్టుకు తరలి వెళ్లింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. పెద్దగట్టు జాతరను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. శ్రీలింగమంతుల స్వామి ఆశీర్వాదాలు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పెద్దగట్టు చైర్మన్ పోలెబోయిన నర్సయ్య యాదవ్, డాక్టర్ రామ్మూర్తి యాదవ్, కక్కిరేణి శ్రీనివాస్, మద్ది శ్రీనివాస్ యాదవ్, అంజాద్ అలీ, కోడి శివయాదవ్, హరీష్ యాదవ్, బత్తుల సాయి, వల్లపు రఘువీర్ యాదవ్, కోడి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

2008 డీఎస్సీ అభ్యర్థులకు పోస్టింగ్

- నియామక ఉత్తర్వులు జారీ చేసిన డీఈఓ భిక్షపతి

నల్లగొండ : 2008 డీఎస్సీలో నష్టపోయిన బీఈడీ అభ్యర్థులకు కాంట్రాక్టు పద్ధతిన ఉద్యోగాలు ఇచ్చేందుకు విద్యాశాఖ ఆదేశాలు ఇవ్వడంతో డీఈఓ బిక్షపతి శనివారం కౌన్సిలింగ్ నిర్వహించి పోస్టింగ్ ఆర్డర్లు అందజేశారు. 2008లో నిర్వహించిన డీఎస్సీలో అప్పటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయంతో రాష్ట్ర వ్యాప్తంగా చాలా మంది నష్టపోయారు. దాంతో వారంతా తాము అర్హులమని.. మాకు ఉద్యోగాలు ఇవ్వాలంటూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఇటీవల న్యాయస్థాన ఆదేశాలతో రాష్ట్ర విద్యాశాఖ వారిని కాంట్రాక్టు పద్ధతిలో విధుల్లో తీసుకునేందుకు అంగీకరించింది. దీంతో జిల్లాలో 75 మంది అభ్యర్థులకు శనివారం డీఈఓ కార్యాలయంలో నియామక ఉత్తర్వులు అందజేశారు. వీరికి ప్రతి నెల రూ.31,040 వేతనం ఇవ్వనున్నారు.

ముగిసిన ఏరియల్ సర్వే



మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ పట్టణంలో హెలికాప్టర్ సాయంతో చేపట్టిన నక్ష ఏరియల్ సర్వే శనివారం ముగిసింది. శనివారం పట్టణంలోని శివారు ప్రాంతాల్లో శాటిలైట్ ద్వారా గ్రౌండ్ కంట్రోల్ పాయింట్లను గుర్తించారు. ఈ సర్వే జిల్లా సర్వే విభాగం ఏడీ శ్రీనివాస్ పర్యవేక్షణలో చేపట్టారు. త్వరలోనే క్షేత్రస్థాయిలో డ్రోన్ సర్వేను చేపట్టనున్నారు.

మిర్యాలగూడ పెద్ద మసీదు కమిటీ రద్దు



మసీదును స్వాధీనం చేసుకున్నట్లు నోటీసు అంటిస్తున్న వక్ఫ్‌బోర్డు అధికారులు

మిర్యాలగూడ : పట్టణంలోని పెద్దబజార్‌లోని పురాతన పెద్ద మసీద్(సారాయే మీరాలం)ను వక్ఫ్‌బోర్డ్ అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటివరకు ఉన్న మసీదు కమిటీ పదవీకాలం ముగియడంతో కమిటీని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ మేరకు కమిటీ రద్దయినట్లు మసీదులో నోటీసు బోర్డుపై అంటించారు. ఈ సందర్భంగా వక్ఫ్ బోర్డ్ టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ మహమ్మద్ ఆసిఫ్‌అలీఖాన్ మాట్లాడుతూ పట్టణంలోని పురాతన పెద్ద మసీదు (సారాయే మీరాలం) కమిటీ పదవీకాలం ముగిసిందన్నారు. ప్రస్తుతం ఎన్నికలు జరిగి కొత్త కమిటీని ఎన్నుకునేంతవరకు మసీదు, దాని ఆధీనంలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మసీదు నిర్వహణ బాధ్యత ప్రత్యేకాధికారిగా వక్ఫ్‌బోర్డ్ ఇన్‌స్పెక్టర్ మహమూద్ వ్యవహరిస్తారని తెలిపారు. త్వరలోనే ఎన్నికలు నిర్వహిస్తామని ఆసక్తిగల వారి నుంచి దరఖాస్తులను స్వీకరిస్తామని తెలిపారు. ఇప్పటి నుంచి మసీదు, షాపింగ్ కాంప్లెక్స్ లావాదేవీలన్నీ వక్ఫ్‌బోర్డ్ యాజమాన్యం నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో లీగల్ అడ్వయిజర్ మహమ్మద్ ఇమ్రాన్, సర్వేయర్ మహమ్మద్ మాజీద్, ఇన్‌స్పెక్టర్ మహమూద్ పాల్గొన్నారు.

ప్రజలు అపోహలకు గురి కావొద్దు

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



అక్కంపల్లి రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

పెద్దఅడిశర్లపల్లి : అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో మృతి చెందిన కోళ్లను వేసిన ఘటనపై ప్రజలు ఎవరూ అపోహలకు గురికావద్దని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. శనివారం పెద్దఅడిశర్లపల్లి మండలలోని అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను ఆమె.. రెవెన్యూ, ఇరిగేషన్, పోలీస్, జల మండలి, వెటర్నరి అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రిజర్వాయర్‌లో కోళ్ల వేసిన సంఘటన తమ దృష్టికి వచ్చిన వెంటనే డిసిప్లీనరీ బృందాన్ని ఏర్పాటు చేసి సమగ్ర విచారణ జరిపించామన్నారు. కోళ్లు వేసిన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకున్నామని తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు నీరు ఎలాంటి కలుషితం కాలేదని, నీటి ప్రవాహంలో ఎలాంటి కోళ్ల కళేభరాలు లేవన్నారు. భూపాల్‌లోని ల్యాబ్‌కు నీటి నమూనాలు పంపిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ రమణారెడ్డి, ఏఎస్పీ మౌనిక, ఇరిగేషన్ డీఈ నాగయ్య, వెటర్నరి డాక్టర్ మహేందర్‌రెడ్డి, సీఐ ధనుంజయ గౌడ్, ఎస్ఐ నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఆడ, మగ పిల్లల్ని సమానంగా పెంచాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా తిపాఠి

నల్లగొండ : మన ఇంటి నుంచే ఆడ, మగ పిల్లలను సమానంగా పెంచాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. శనివారం కలెక్టరేట్ ఉదయాదిత్య భవన్‌లో పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధిక చట్టంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ చట్టంపై ప్రతి మహిళా ఉద్యోగికి అవగాహన ఉండాలని, వారి కార్యాలయ పరిధిలో ఇంటర్నల్ కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వేధింపులకు గురైతే పిర్యాదు చేసేలా మహిళలకు ధైర్యం కల్పించాలన్నారు. డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ దీప్తి మాట్లాడుతూ ఈ చట్టాన్ని 2013లో పార్లమెంట్ ఆమోదించిందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి కెవి.కృష్ణవేణి, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

సేవాలాల్ మార్గంలో నడవాలి



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, వేముల వీరేశం, మందుల సామేలు, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ తదితరులు

మిర్యాలగూడ : గిరిజన ఆరాధ్య దైవం శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ మార్గంలో ప్రతి గిరిజనుడు నడవాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం సంత్‌సేవాలాల్ 286వ జయంతి సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మహాబోగ్ బండార్ కార్యక్రమంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ సంత్‌సేవాలాల్ ఆశయాలను గిరిజనులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సేవాలాల్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా ఘనంగా నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో ధీరావత్ స్కైలాబ్‌నాయక్, మాలోతు దశరథ్‌నాయక్, భూక్యా లక్ష్మణ్‌నాయక్, బాలాజీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాక్టికల్స్‌కు 111 మంది గైర్హాజరు

నల్లగొండ : ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్‌కు శనివారం 111 మంది గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన పరీక్షకు మొత్తం 1,661 విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 1,602 మంది హాజరయ్యారు. 59 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 1,039 మంది హాజరుకావాల్సి ఉండగా.. 987మంది పరీక్ష రాశారు. 52 మంది గైర్హాజరయ్యారు.

ఇస్మార్ట్ గౌరమ్మ

- ఇన్‌స్టాగ్రామ్ 'రీల్స్' చేస్తూ ఔరా అనిపిస్తున్న రంగ గౌరమ్మ
- మనవరాలే గురువుగా డిజిటల్ పాఠాలు నేర్చుకున్న బామ్మ
- ఇల్లు, పొలాలే స్టూడియోగా వీడియోలు, రీల్స్

చిన్నతనంలో విన్న పద్యాలు, పౌరాణిక నాటకాలు చూసిన ఆమెకు తాను అలా పాడాలని.. నాటకాల్లో నటించాలని కోరిక ఉండేది. 'ఆ బంగారు కాలం ఎటుబాయే' అని బాధపడే గౌరమ్మకు స్మార్ట్ ఫోన్ కొత్త ప్రపంచాన్ని పరిచయం చేసింది. తన మనువరాలి సాయంతో ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ చేస్తూ వేల మంది ఫాలోవర్స్‌ను సంపాదించి.. పలువురి చేత ఔరా అనిపించుకుంటోంది.

\- రాజపేట

సండే స్పెషల్



కూలీలతో కలిసి ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ చేస్తున్న రంగ గౌరమ్మ

యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని రేణిగుంట గ్రామానికి చెందిన రంగ గౌరమ్మ, ఆమె భర్త భిక్షపతి నిరక్షరాసులు. వ్యవసాయ కూలి పనులే వారికి జీవనాధారం. స్కూల్ పిల్లలు, కాలేజీ పిల్లలు సెల్‌ఫోన్ ప్రపంచంలో తలమునకలవుతూ ఈ ప్రపంచాన్నే మరిచిపోవడాన్ని ఎన్నోసార్లు గమనించింది గౌరమ్మ. సెల్‌ఫోన్‌లో ఎన్నో యూట్యూబ్ వీడియోలు, రీల్స్ చూసింది. అవి చూసినప్పుడల్లా తనలోని కళాకారిణి మేల్కొనేది. 'బావా ఎపుడు వచ్చితీవు' 'చెల్లియో చెల్లకో' 'ఎక్కడ నుండి రాక' 'జెండాపై కపిరాజు'.. ఇలా ఎన్నో పద్యాలు తన చిన్నప్పటి రోజుల్లో విన్నది. సత్యహరిశ్చంద్ర, గయోపాఖ్యానం, శ్రీరామంజనేయ యుద్ధం, శ్రీకృష్ణ తులాభారం, నర్తనశాల.. ఇలా ఎన్నో పౌరాణిక నాటకాలు చూసింది. పద్యాలు విన్నప్పుడల్లా.. తానూ పాడేది. నాటకాలు చూసినప్పుడల్లా తనకు కూడా వేదిక ఎక్కి నటించాలని ఉండేది. కానీ, ఎవరు ఏమంటారో అనే భయంతో నటించాలనే కోరిక తనలోనే ఉండిపోయేది.

ప్రశంసలతో మరింత ఉత్సాహం

గత కాలాన్ని కళ్ల ముందుకు తీసుకొస్తున్న సెల్‌ఫోన్‌ను కొనాలని గౌరమ్మ నిర్ణయించుకుంది. అక్క మనుమరాలు రీతిక, మేనకోడలు మౌనిక ప్రోత్సాహంతో స్మార్ట్ ఫోన్ కొని వినియోగిస్తుంది. వారి ద్వారా ఫోన్ ఎలా వాడాలో నేర్చుకుంది. చిన్న చిన్న వీడియోలు తీయడం, రీల్స్ తీస్తు.. తాను చేసిన వీడియోలను గత సంవత్సరం నుంచి యూట్యూబ్, ఇన్‌స్టాగామ్‌లో పోస్ట్ చేసేంది. ఆ వీడియోలు చూసి మొదట ఊరి వాళ్లు, చుట్టాలు పక్కాలు 'మన గౌరమ్మేనా!' అని ఆశ్చర్యపోయారు. ఆ తర్వాత అభినందించారు. వారి అభినందనలు, ప్రశంసలు తనకు మరింత ఉత్సాహాన్నిచ్చాయి. చుట్టుపక్కల ఊరి వాళ్లు కూడా తనను గుర్తుపట్టి ప్రశంస పూర్వకంగా మాట్లాడేవారు. గౌరమ్మ చేసిన పోస్టులకు లైకులు రావడం, సబ్‌స్క్రైబర్లు పెరగడం మొదలైంది.

> **మెచ్చుకోవడం సంతోషంగా ఉంది**
>
> యూట్యూబ్ వీడియోలు, ఇన్‌స్టాగామ్స్ 'రీల్స్' చూసిన తరువాత నాకు కూడా ఏదైనా చేయాలనిపించింది. అక్షరం ముక్క రాకపోయినా చాలా బాగా వీడియోలు చేసి ఎంతోమంది చేత 'శభాష్' అనిపించుకుంటున్న వారిని యూట్యూబ్‌లో చూసిన తరువాత నాకు కూడా ధైర్యం వచ్చింది. రీల్స్, వీడియోలు చేయడానికి ఎక్కడికీ పోనవసరం లేదు.. మన ఇల్లు, పొలాలే స్టూడియో అనుకొని పనిలోకి దిగాను. ఎంతోమంది మెచ్చుకోవడం సంతోషంగా ఉంది.
>
> \- రంగ గౌరమ్మ



భర్త భిక్షపతితో కలిసి రీల్స్ చేస్తున్న రంగ గౌరమ్మ

క్లీన్ అండ్ గ్రీన్ షార్ట్స్

పద్ధతిగా వీడియోలు చేస్తూ 'భేష్' అనిపించుకుంటుంది గౌరమ్మ. జాతరలు, దేవాలయాల దర్శనం, పెళ్లిళ్లు, పేరంటాలు, పిల్లలను తొట్టెల్లో వేయడం, వ్యవసాయ పనులు చేసే కూలీలు, వరి నాట్లు వేయడం, ముగ్గులు వేసే మహిళలు.. ఇలా తనకు తోచినట్టుగా రీల్స్ చేస్తూ వచ్చింది. ఇప్పటివరకు మొత్తం 1500 వరకు పోస్టులు చేయగా 8,831 మంది ఫాలోవర్స్ ఉన్నారు. గౌరమ్మ చేస్తున్న 'రీల్స్' ప్రాచుర్యం పొందడంతో ఆమె పేరు కాస్త 'ఇన్‌స్టాగామ్ గౌరమ్మ'గా మారింది.

క్లుప్తంగా

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గానికి చెందిన గిరిజన నాయకులు శనివారం హైదరాబాద్‌లో మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని సన్మానించి సంత్ సేవాలాల్ జయంతి వేడుకలకు రావాలని ఆహ్వానించారు. అనంతరం వారితో మంత్రి సమావేశమై మాట్లాడారు. నియోకవర్గంలో వందల కోట్ల రూపాయలతో పలు శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ఎత్తిపోతల పథకాలన్నింటినీ పునరుద్ధరిస్తున్నట్లు మంత్రి ప్రకటించారు.

తాడిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి



సిద్దులు (ఫైల్)

రాజాపేట: ప్రమాదవశాత్తు తాడిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతిచెందాడు. ఈ ఘటన రాజాపేట మండలం నెమిల గ్రామంలో శనివారం జరిగింది. నెమిల గ్రామానికి చెందిన గీత కార్మికుడు పాల సిద్దులు(34) రోజుమాదరిగానే కల్లు గీసేందుకు శనివారం ఉదయం గ్రామ శివారులో తాటిచెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు మోకు జారి పైనుంచి కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. అక్కడే గొర్రెలు కాస్తున్న కాపరి చూసి మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య స్వాతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సాయికుమార్ కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పరారీలోనే ఫోర్జరీ నిందితుడు


చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ ఆర్డీఓ సంతకాన్ని ఫోర్జరీ చేసి తప్పుడు నాలా పత్రాలు సృష్టించిన కేసులో నిందితులుగా ఉన్న సుర్వి అంజయ్యను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన విషయం విదితమే. ఈ కేసులో రెండో నిందితుడిగా ఉన్న చౌటుప్పల్ మండలం దామెర గ్రామానికి చెందిన రిపోర్టర్ ఐతగోని రాఘవేంద్రను శనివారం కూడా పోలీసులు అరెస్ట్ చేయలేదు. పోలీసులు నిందితులను పట్టుకోవడానికి ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లోని వనస్థలిపురంలో ఉంటున్న రాఘవేంద్రకు ఫోర్జరీ కేసు నమోదైన విషయం తెలియగానే తప్పించుకు తిరుగుతున్నాడని పోలీసులు చెబుతున్నారు. రెండు రోజుల్లో రాఘవేంద్రను పట్టుకుని కోర్టులో హాజరుపరుస్తామని చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ తెలిపారు.

పెద్దగట్టు.. భద్రత కట్టుదిట్టం

2వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు

- 68 సీసీ కెమెరాలతో నిరంతరం నిఘా
- 50 మంది సిబ్బందితో షీ టీమ్స్
- ప్రత్యేక బస్సులు నడుపుతున్న ఆర్టీసీ

సూర్యాపేటటౌన్: దురాజ్‌పల్లి పెద్దగట్టు లింగమంతులస్వామి జాతర ఆదివారం నుంచి ప్రారంభంకానుంది. ఐదు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరగనున్న ఈ జాతరకు లక్షలాది మంది భక్తులు తరలిరానున్నారు. పెద్దగట్టు లింగమతులస్వామి జాతరకు పోలీస్ శాఖ సమాయత్తమైంది. భక్తులు భారీ సంఖ్యలో రానున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా రెండు వేల మంది సిబ్బందితో పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తోంది. ముగ్గురు ఏఎస్పీలు, 10 మంది డీఎస్పీలు, 35 మంది సీఐలు, 148మంది ఎస్‌ఐలు, 400మంది ఏఎస్‌ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, 200 మంది మహిళా సిబ్బందితో పాటు స్పెషల్ పార్టీ, డాగ్ స్క్వాడ్ బృందాలు విధుల్లో ఉండనున్నారు. వీరితో పాటు అదనంగా మఫ్టీ సిబ్బంది, సీసీఎస్ సిబ్బంది, టెక్నికల్ టీం సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది, పోలీసు కళాబృందాలు ఉంటాయి. మూడు షిఫ్టుల్లో 24గంటలు పోలీస్ సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. సూర్యాపేట జిల్లాతో పాటు నల్లగొండ, వికారాబాద్, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, నాగర్ కర్నూల్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల, ఖమ్మం, మహబూబాబాద్, కొత్తగూడెం జిల్లాల పోలీస్ సిబ్బంది విధుల్లో ఉంటారు. మరో 500 మంది వలంటీర్లను నియమించారు. జాతర పరిసరాల్లో పోలీసు కంట్రోల్ రూం, హెల్ప్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. 68 సీసీ కెమెరాలు, డ్రోన్లతో ప్రత్యేక నిఘా ఏర్పాటుచేస్తున్నారు. ఈ సీసీ కెమెరాలు దొంగలను వెంటనే గుర్తిస్తాయి. ఫేషియల్ రికగ్నిజేషన్ కెమెరాలను జాతర ప్రాంగణంలో అమర్చారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా వాహనాల మళ్లింపు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వాహనాల కోసం ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలాలతో సిద్ధం చేసిన రూట్ మ్యాప్‌ను సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ గురువారం విడుదల చేశారు.



పార్కింగ్ స్థలాలు..

- మొదటి పార్కింగ్ ప్రదేశం : సూర్యాపేట మీదుగా జాతరకు వచ్చే భక్తుల వాహనాల కోసం విజయవాడ–హైదరాబాద్ హైవే మీద గల హెచ్‌పీ పెట్రోల్ బంక్ నుంచి రాంకోటి తండాకు వెళ్లే మార్గంలో పార్కింగ్ స్థలం ఏర్పాటు చేశారు.
- రెండో పార్కింగ్ ప్రదేశం : గరిడేపల్లి, పెనపహడ్ వైపు నుంచి వచ్చే భక్తుల వాహనాలను పాత కలెక్టరేట్ కార్యాలయం వెనుక గల స్థలంలో పార్కింగ్ స్థలం ఏర్పాటు చేశారు.
- మూడో పార్కింగ్ ప్రదేశం : కోదాడ, మునగాల, గుంపుల మీదుగా జాతరకు వచ్చే భక్తుల వాహనాలను ఖాసింపేట గ్రామం వెళ్లే మార్గంలో పార్కింగ్ స్థలం ఏర్పాటు చేశారు.
- నాలుగో పార్కింగ్ ప్రదేశం : మోతె, చివ్వెంల మీదుగా జాతరకు వచ్చే భక్తుల వాహనాలను చివ్వెంల మీదుగా మళ్లించి మున్యానాయక్ తండా వద్ద(గట్టుకు వెనకాల) పార్కింగ్ స్థలం కేటాయించారు.

ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

భానుపురి (సూర్యాపేట): పెద్దగట్టు లింగమంతుల జాతరకు వచ్చే భక్తుల కోసం సూర్యాపేట కొత్త బస్టాండ్ నుంచి దురాజ్‌పల్లి జాతర వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బస్టాండ్ వరకు ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నారు. ప్రైవేటు వాహనాల్లో వచ్చే ప్రయాణికులు పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలను నిలిపి సూర్యాపేట కొత్తబస్టాండ్‌కు చేరుకోవాల్సి ఉంటుంది. అక్కడి నుంచి ఆర్టీసీ ఏర్పాటు చేసిన బస్సుల్లో గట్టు వద్దకు చేరుకోవాల్సి ఉంటుంది. రోజూ సూర్యాపేట బస్టాండ్ నుంచి 60 బస్సుల్లో పెద్దగట్టుకు భక్తులను తరలించనున్నారు. సూర్యాపేట కొత్త బస్టాండ్‌తో పాటు ఖమ్మం క్రాస్‌రోడ్డు, పొట్టి శ్రీరాములు సెంటర్, జమ్మిగడ్డ తదితర ప్రాంతాల్లో ప్రత్యేక స్టాప్‌లను ఏర్పాటు చేశారు. ఇక్కడికి వచ్చే ప్రయాణికులకు ఎప్పటికప్పుడు సమాచారం ఇచ్చేందుకు 200మంది సిబ్బందిని సైతం నియమించారు. కాగా జాతరకు వచ్చే భక్తుల్లో చిన్నారులకు రూ.20, పెద్దలకు రూ.40 చొప్పున చార్జీ వసూలు చేయనున్నారు. ఇప్పటికే మహిళలకు అందుతున్న ఉచిత బస్సు ప్రయాణం జాతరకు వర్తింపజేయనున్నారు.

పోలీసులు బాధ్యతతో మెలగాలి



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యాపేట ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

చివ్వెంల(సూర్యాపేట): లింగమంతుల జాతర నేపథ్యంలో పోలీసులు బాధ్యతతో, సహనంతో మెలగాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. శనివారం రాత్రి జాతర ప్రాంగణంలో పోలీస్ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతరకు భక్తులు అధికంగా వచ్చే అవకాశం ఉందన్నారు. భక్తులు గుంపులు గుంపులుగా వెళ్లకుండా, స్వామివారిని దర్శించుకునేంత వరకు వారికి పోలీసులు సరైన సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. ఏదైనా సమస్యలు వస్తే సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. రిలీవర్ వచ్చే వరకు విధులు వదిలి వెళ్లొద్దన్నారు. వాహనాల మళ్లింపు, నియంత్రణ చాలా ముఖ్యమన్నారు. వాహనాల పార్కింగ్, మళ్లింపు ప్రదేశాల్లో విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి, వాహనదారులకు దారి చూపాలన్నారు. జాతరకు వచ్చే భక్తులు, ప్రజలు, వాహనదారులు పోలీసులకు సహకరించాలని కోరారు.

పెద్దగట్టుకు పోవాలంటే..

- హైదరాబాద్ నుంచి సూర్యాపేటకు 139 కి.మీ ఉంటుంది. అక్కడి నుంచి దురాజ్‌పల్లి పెద్దగట్టు జాతర వరకు 5.3 కిలోమీటర్లు ఉంటుంది.
- భువనగిరి, వలిగొండ, చిట్యాల మీదుగా దురాజ్‌పల్లి పెద్దగట్టు జాతర వరకు 110 కిలోమీటర్లు ఉంది.
- నల్లగొండ జిల్లా కేంద్రం నుంచి నకిరేకల్, సూర్యాపేట మీదుగా జాతర వరకు 53 కిలోమీటర్లు..
- మిర్యాలగూడ నుంచి పచారుగడ్డ మీదుగా జాతర వరకు 45 కిలోమీటర్లు ఉంది.
- మిర్యాలగూడ నుంచి నేరేడుచర్ల మీదుగా 45 కిలోమీటర్లు ఉంది.
- హుజూర్‌నగర్ నుంచి గరిడేపల్లి మీదుగా 44 కిలోమీటర్లు ఉంది
- కోదాడ నుంచి జాతీయ రహదారి మీదుగా జాతర వరకు 40 కిలోమీటర్లు ఉంది.

అంతర్ రాష్ట్ర మహిళా దొంగల అరెస్ట్

- రూ.3,40,000 విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర

భువనగిరి: చోరీలకు పాల్పడుతున్న మహిళా దొంగలను అరెస్ట్ చేసినట్లు భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను శనివారం డీసీపీ రాజేష్‌చంద్ర తన కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడకు చెందిన గన్నికోట దుర్గ, నక్క మంగ, గండికోట లక్ష్మి, నక్క యోహాన్ ముఠాగా ఏర్పడి రద్దీగా ప్రదేశాలు, బస్టాండ్లు, రైతు బజార్లు, బ్యాంకుల వద్ద చోరీలకు పాల్పడుతుంటారు. దొంగతనం చేసే సమయంలో ఎవరికీ అనుమానం రాకుండా చిన్న పిల్లలను వెంట తీసుకెళ్లేవారు. ఈ నెల 11వ తేదీన భువనగిరి బస్టాండ్‌లో ఒక మహిళ తన పిల్లలతో కలిసి బస్సు ఎక్కేందుకు నిలబడి ఉండగా 5 తులాల బంగారు ఆభరణాలు, రూ.5వేల నగదు ఉన్న ఆమె పర్సును దొంగిలించారు. అదే రోజు బాధితురాలు భువనగిరి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేసుని దర్యాప్తు చేపట్టారు. దుర్గ, మంగ, లక్ష్మి భువనగిరి బస్టాండ్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు శుక్రవారం సీసీ కెమెరాల ద్వారా పోలీసులు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా చేసిన దొంగతనాల గురించి ఒప్పుకున్నారు. కారులో ఉన్న యోహాన్ కారు అక్కడ వదిలి పారిపోయాడు. గతంలో జగిత్యాల జిల్లా కోరుట్లలో 3 తులాల బంగారు ఆభరణాలు, మహబూబాబాద్ జిల్లా తొర్రూర్‌లో రూ. 2వేల నగదు, ఏపీలోని విశాఖపట్నం జిల్లా గాజువాకలో నాలుగు తులాల బంగారు ఆభరణాలు చోరీ చేసినట్లు ఒప్పుకున్నారు. దుర్గ, మంగ, యోహాన్‌పై విశాఖపట్నం, గుంటూరు, విజయవాడ, ఎన్టీఆర్ కృష్ణా, తూర్పుగోదావరి, కడప, ప్రకాశం జిల్లాలో కేసులు ఉన్నట్లు డీసీపీ చెప్పారు. 2024లో జైలుకు వెళ్లి 2025 జనవరి మొదటి వారంలో బయకు వచ్చి మళ్లీ దొంగతనాలు చేయడం ప్రారంభించినట్లు పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ.3,40,000 విలువ చేసే బంగారు ఆభరణాలు, నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వారిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఏసీపీ రాహుల్‌రెడ్డి సహకారంతో దొంగలను పట్టుకున్న పోలీస్ సిబ్బందిని డీసీపీ అభినందించారు.

బీజేపీ అభ్యర్థిని గెలిపించండి

- కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి



బీజేపీ అభ్యర్థికి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలపై పూర్తి అవగాహన, అనుభవం ఉన్న బీజేపీ అభ్యర్థి పులి సరోత్తమ్‌రెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటుతో నల్లగొండ–ఖమ్మం–వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర పర్యాటక శాఖ మంతి జి. కిషన్‌రెడ్డి అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం నల్లగొండలోని ఓ హోటల్‌లో ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయుల, ఉద్యోగులు, నిరుద్యోగుల సమస్యలపై శాసనమండలిలో మాట్లాడాలంటే కేవలం బీజేపీ అభ్యర్థులతోనే సాధ్యమన్నారు. ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు ఇవ్వాల్సిన పీఆర్సీ, డీఏలను ప్రభుత్వం ఇంతవరకు ఇవ్వలేదన్నారు. అనంతరం ప్రగతి కాలేజీకి అధ్యాపకులను కలిసి బీజేపీ అభ్యర్థికి ఓటేసి గెలిపించాలని కోరారు. అంతకుముందు బీజేపీ కార్యాలయంలో సంత్ సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి. మనోహర్‌రెడ్డి, గోలి మధుసూదన్‌రెడ్డి, మాదగోని శ్రీనివాస్‌గౌడ్, నూకల నరసింహారెడ్డి, నూకల వెంకట్‌నారాయణరెడ్డి, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, పిల్లి రామరాజుయాదవ్, కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, పాశం శ్రీనివాస్‌రెడ్డి, భవానీ ప్రసాద్, పాలకూరి రవిగౌడ్, రావెళ్ల కాశమ్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేది బీజేపీనే..

శాసనమండలిలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేది బీజేపీ మాత్రమేనని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండలోని బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ తరఫున గెలిచిన వారు బీఆర్‌ఎస్‌లో చేరి మండలిలో ఏం చేశారో మనందరికి తెలుసన్నారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగులు, ప్రజల పక్షాన మాట్లాడకుండా బీఆర్‌ఎస్ పార్టీలో చేర్చుకుని శాసనమండలి ప్రాముఖ్యతను తగ్గించే ప్రయత్నం చేశారన్నారు. ఉపాధ్యాయుల పక్షాన పోరాడే అనుభవం ఉన్న పులి సరోత్తమ్‌రెడ్డిని బీజేపీ పార్టీ వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నిలబెట్టినట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ గత పదేళ్లలో, కాంగ్రెస్ ఏడాది పాలనలో ఉపాధ్యాయులుకు, ఉద్యోగులకు చేసిందేమీ లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించిన జాబ్ క్యాలెండర్‌లోని ఉద్యోగాలను డిసెంబర్‌లోగా ఎందుకు భర్తీ చేయలేదని ప్రశ్నించారు. ప్రతి మండలంలో అంతర్జాతీయ పాఠశాల, రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు, విద్యా శాఖకు డబుల్ బడ్జెట్ హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. నిరుద్యోగులకు రూ.4వేల భృతి, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పీఆర్సీ ఇవ్వలేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.8వేల కోట్ల బకాయి ఉందని, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ఉపకార వేతనాలు విడుదల చేయలేదన్నారు. గురుకులాల్లో ఆహారం విషపూరితం కావడం, విద్యార్థుల ఆత్మహత్యలకు ప్రభుత్వమే కారణమన్నారు. విద్యార్థినులకు స్కూటీలు, మహిళలకు రూ.2500 ఇస్తామని కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. బీజేపీ తరఫున పోటీ చేస్తున్న సరోత్తంరెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి. మనోహర్‌రెడ్డి, మాదగోని శ్రీనివాస్‌గౌడ్, గోలి మధుసూదన్‌రెడ్డి, నూకల నరసింహారెడ్డి, సునీత, శ్యాంసుందర్, పిల్లి రామరాజు, కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉదయ సముద్రంలో ఆవు కళేబరం

- నాలుగు రోజుల క్రితం పడినట్లు అనుమానం
- కుళ్లిపోయి కట్టవరకు కొట్టుకొచ్చిన ఆవు



కట్ట వరకు కొట్టుకువచ్చిన ఆవు కళేబరం

నల్లగొండ టూటౌన్: నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని పానగల్ ఉదయం సముద్రంలో శనివారం ఆవు కళేబరం కనిపించడం కలకలం రేపింది. ఉమ్మడి జిల్లాలోని వందలాది గ్రామాలతో పాటు నీలగిరి మున్సిపాలిటీకి ఉదయ సముద్రం నుంచి తాగునీరు సరఫరా అవుతుంది. ఉదయ సముద్రం వెనుక భాగం నుంచి ఆవు అందులోకి వెళ్లి మృత్యువాత పడినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉదయ సముద్రం కట్ట మధ్యలో ఉన్న తూము వరకు ఆవు కళేబరం కొట్టుకొచ్చి ఆగిపోయింది. నాలుగు రోజులు కావస్తుండడంతో ఆవు పూర్తిగా కుళ్లిపోయి కనిపిస్తోంది. ఇప్పటికే అక్కంపల్లి రిజర్వాయర్‌లో చనిపోయిన కోళ్లు వేశారనే వార్త ప్రకంపనలు సృష్టించిన విషయం తెలిసిందే. మరి ఇక్కడ చనిపోయిన ఆవును అక్కడ పడేస్తే ఇక్కడికి కొట్టుకువచ్చిందా లేక.. ఆవు ప్రమాదవశాత్తు అందులోకి వెళ్లి మరణించిందా అనేది తెలియాల్సి ఉంది. ఆవులంటే నీటిలో కూడా ఈదుకుంటూ వెళ్తుంటాయి. మరి ఈ ఆవు ఏ కారణం చేత చనిపోయిందో తెలియని పరిస్థితి నెలకొంది. అధికార యంత్రాంగం ఆవు కళేబరాన్ని తొలగించాల్సిన అవసరం ఉంది.

న్యాయం చేయాలని మహిళ నిరసన



నకిరేకల్ పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న నాగమణి

నకిరేకల్: ఏఆర్ కానిస్టేబుల్ అయిన తన భర్త మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని తనను వేధిస్తున్నాడని గత నెల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ తగిన న్యాయం జరగలేదని ఆరోపిస్తూ ఓ మహిళ శుక్రవారం రాత్రి నకిరేకల్ పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన చేపట్టింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా మునగాల మండలం నేలమర్రికి చెందిన మొగిలి సైదులుకు చిలుకూరు మండలం ఆచార్యులగూడేనికి చెందిన నాగమణితో 2011లో వివాహం జరిగింది. నల్లగొండలో ఏఆర్ పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సైదులు ప్రస్తుతం కేతేపల్లి పోలీస్ స్టేషన్‌లో డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. సైదులు నకిరేకల్‌లోని పటేల్ నగర్‌లో ఓ ఇంట్లో మరో మహిళతో కలిసి అద్దెకు ఉంటున్న విషయాన్ని తెలుసుకున్న అతడి భార్య నాగమణి గత నెల 22న స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. నెల రోజులు గడుస్తున్నా పోలీసులు ఎలాంటి న్యాయం చేయలేదని నాగమణి ఆవేదన వ్యక్తం చేస్తూ నకిరేకల్ పోలీస్ స్టేషన్ ఎదుట శుక్రవారం రాత్రి నిరసన చేపట్టింది. సీఐ రాజశేఖర్ వచ్చి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆమె అక్కడి నంచి వెళ్లిపోయింది.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



ఇబ్రహీం సోహెల్ (ఫైల్)

యాదగిరిగుట్ట రూరల్ : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. హైదరాబాద్‌లోని కిషన్‌బాగ్‌కు చెందిన ఇబ్రహీం సోహెల్(26), తన బంధువు ఎండీ అస్లాంతో కలిసి ఈ నెల 11వ తేదీన పెళ్లి పత్రికలు ఇచ్చేందుకు బైక్‌పై హన్మకొండకు వెళ్తుండగా.. హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారిపై యాదగిరిగుట్ట మండలం గోధుమకుంట గ్రామ పరిధిలో వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎండీ అస్లాం అక్కడికక్కడే మృతిచెందగా.. తీవ్రంగా గాయపడిన ఇబ్రహీం సోహెల్ హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. ఇబ్రహీం సోహెల్ దుబాయ్‌లో ఉద్యోగం చేస్తున్నాడని, తన అక్క పెళ్లి కోసమని 15రోజుల క్రితం హైదరాబాద్‌కు వచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నెల 21వ తేదీన పెళ్లి పత్రికలు ఇవ్వడానికి హన్మకొండలో వరుడి ఇంటికి వెళ్తుండగా రోడ్డు ప్రమాదం జరిగినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

ఉరేసుకొని యువకుడి బలవన్మరణం

సూర్యాపేటటౌన్: ఒంటరితనం భరించలేక ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట పట్టణంలోని కృష్ణనగర్ కాలనీకి చెందిన చిత్తలూరి సిద్ధు(21) కూలీ పనిచేస్తూ అద్దె ఇంట్లో నివసిస్తున్నాడు. సిద్ధు తల్లిదండ్రులు గతంలోనే మృతిచెందారు. తనకు తల్లిదండ్రులు లేకపోవడంతో పాటు బంధువులు సపోర్ట్ లేదని మనస్తాపం చెంది శనివారం తాను అద్దెకు ఉంటున్న ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి ఒక చెల్లెలు, తమ్ముడు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సూర్యాపేట పట్టణ సీఐ తెలిపారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



కల్వకుంట్ల కవితకు గొర్రెపిల్లను బహూకరించిన నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

చిట్యాల : ఎన్నికలకు ముందు ప్రజలకిచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి ఖమ్మంలో జరిగే సమావేశానికి వెళ్తూ మార్గమధ్యలో ఆమె కాసేపు ఆగారు. ఈ సందర్భంగా ఆమెకు నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. రైతులకు వందశాతం రూ.2లక్షల రుణమాఫీ చేయాలన్నారు. వేసవి కాలం ఆరంభంలోనే విద్యుత్ కష్టాలు ఆరంభమయ్యాయని, నిరంతరాయంగా వ్యవసాయ పొలాలకు విద్యుత్ అందించాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ జడల ఆదిమల్లయ్య, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మెండె సైదులు, చిట్యాల, వెలిమినేడు గ్రామాల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు పొన్నం లక్ష్మయ్యగౌడ్, అర్రూరి శ్రీశైలం, మాజీ సర్పంచ్‌లు కొలను సతీష్‌గౌడ్, మర్రి జలంధర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు జనగాం నర్సింహగౌడ్, గొలనుగొండ దశరథ, నాయకులు కొలను వెంకటేష్‌గౌడ్, బాలగోని రాజుగౌడ్, మేడి రాజు, చిత్రగంటి ప్రవీణ్, రుద్రవరం యాదయ్య, జిట్ట శేఖర్, బోల్గూరి సైదులు, ఆగు అశోక్ పాల్గొన్నారు.

ముగిసిన క్రీడా పోటీలు



మొదటి బహుమతి పొందిన మిర్యాలగూడ జట్టు



కబడ్డీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

నల్లగొండ: మిషన్ పరివర్తన్–యువ తేజం కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీస్ శాఖ నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు శనివారంతో ముగిశాయి. నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాల మైదానంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి జిల్లా ఎస్పీ శరత్ చంద్రం పవార్ హాజరై గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ మౌనిక, ఎస్‌బీ డీఎస్పీ రమేష్, నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, డీఎస్పీ విఠల్‌రెడ్డి, సీఐలు రాజశేఖర్ రెడ్డి, నాగరాజు, కరుణాకర్, ధనంజయ, ఆర్‌ఐ సురప్పానాయుడు, ఎస్‌ఐలు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.